పేరుకు ఎక్కువ.. వసతులకు తక్కువ!

- హెడ్‌పోస్టాఫీస్‌లో తిష్టవేసిన కుక్కలు
- పట్టించుకోని కార్యాలయ సిబ్బంది
- కనిపించని మౌలిక వసతులు

ఒంగోలు వన్‌టౌన్:

జిల్లా కేంద్రం ఒంగోలులోని హెడ్ పోస్టాఫీస్‌లో కుక్కలు తిష్టవేశాయి. పోస్టాఫీస్‌లో వినియోగదారులకు కనీస సౌకర్యాలు అందక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడే కుక్కలు నిద్రిస్తున్నా ఏ ఒక్క సిబ్బంది పట్టించుకోవడం లేదు. సాఫ్ట్‌వేర్ అపడేట్ చేశాం.. నూతన పథకాలను అమలు చేస్తున్నాం అని ప్రకటనలు ఇస్తున్న అధికారులు ముఖ్య కేంద్రంలో కనీస సౌకర్యాలను కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఒక్క పోస్టుమాస్టర్ కూడా అందుబాటులో ఉండటం లేదని వినియోగదారులు చెప్తున్నారు. ఉదయం ఒక అధికారి విధుల్లో ఉంటే సాయంత్రం మరొకరు విధుల్లో ఉంటారు. హెడ్ పోస్టాఫీసు కావడంతో ప్రతి రోజు దాదాపు 500 మంది వరకు వినియోగదారులు కార్యాలయాన్ని పనుల నిమిత్తం సందర్శిస్తుంటారు. వినియోగదారులకు కనీసం సరిపడా కుర్చీలు ఉండవు. అదే విధంగా తాగునీటి సౌకర్యం అసలే ఉండదు. పాస్‌పోర్టు సేవా కేంద్రం ఈ ప్రాంగణంలోనే ఉంది. ఇక్కడ కుడా కనీసం కూర్చోవడానికి కుడా సౌకర్యాలు ఉండదు. ఆరుబయట ఎంతసేపు అయినా నిలబడాల్సిందేనని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




జిల్లా హెడ్ పోస్టాఫీసులో తిష్ట వేసిన కుక్కలు

ఆధార్ నమోదు కేంద్రంలో అంతా చీకటే..

జిల్లా కేంద్రం పోస్టాఫీసులో ఆధార్ నమోదు కేంద్రానికి భారీ సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. కొంతమందికి రెండు మూడు రోజుల వెయిటింగ్ లిస్టు ఉంటుంది. అయినా భారీగానే వినియోగదారులు వస్తుంటారు. ఆధార్ నమోదు కేంద్రం గదిలో సరైన వెలుతురు, గాలి రాదు. లోపలికి వెళ్లిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అయినా అధికారులు పట్టించుకోరు. ముఖ్య కేంద్రంలో పోస్టల్ ఖాతాలు, ఆర్‌డీలు, ఎస్ఎస్‌వైలు, ఇతర ఇన్సూరెన్సులు కట్టేందుకు అధిక సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. వీరికి సరైన విధంగా సేవలు అందడం లేదు. కార్యాలయానికి వచ్చే వారికి పార్కింగ్ సౌకర్యం లేదు. రోడ్డు మీద గోడ ముందు రోడ్డు మార్జిన్‌లో కొన్ని ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తారు. పోస్టల్ కార్యాలయం ముందు వైపు అధికంగా ఖాళీ ప్రదేశం ఉన్నా వినియోగించుకోవడం లేదు. ఇప్పటికైనా పోస్టాఫీస్‌లో సరైన మౌలిక వసతులు కల్పించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు: నేడు శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ టెక్స్‌బుక్స్ సేల్స్ మేనేజర్‌గా పేరయ్య



బాధ్యతలు చేపట్టిన పేరయ్య

ఒంగోలు సిటీ: జిల్లా గవర్నమెంట్ టెక్స్ బుక్స్ సేల్స్ మేనేజరుగా సుద్దపల్లి పేరయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన నెల్లూరు జిల్లా డీఈఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. సేల్స్ మేనేజర్‌గా గుంటూరు రీజనల్ జాయింట్ డైరెక్టర్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రమాదేవి



కంకణాల రమాదేవి

ఒంగోలు సిటీ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లాకు చెందిన కంకణాల రమాదేవి ఎన్నికయ్యారు. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగాయి. జిల్లా నుంచి పది మంది ప్రతినిధులు హాజరవగా, చివరి రోజు రాష్ట్ర నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా కే శ్రీదేవి, వి.సావిత్రి, కోశాధికారిగా డి.శ్రీనివాసకుమారి ఎన్నికయ్యారు. 14 మందితో కూడిన రాష్ట్ర ఆఫీస్ బేరర్లలో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లాకు చెందిన కంకణాల రమాదేవి ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కూడా జిల్లాకు చెందిన సయ్యద్ షర్మిల ఎన్నికయ్యారు. వీరికి జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 35 మందికి జరిమానా

ఒంగోలు సిటీ: మద్యం తాగి వాహనాలు నడిపినందుకు కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ పాండురంగారావు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ వీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై గట్టి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షలు చేసి డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి పట్టుబడిన 35 మందికి ఒంగోలు రెండో ఏఎంఎం కోర్టు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు.

పేదలకు వైద్యం అందకుండా కూటమి కుట్ర



కోటి సంతకాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న రవిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు



కోటి సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, పార్టీ శ్రేణులు

- కరోనా కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులే ఆదుకున్నాయి
- ధ్వజమెత్తిన నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, నాయకులు
- మోటుమూలలో వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ

కొత్తపట్నం: పేదలకు వైద్యం అందకుండా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. గురువారం మండలంలోని మోటుమూల గ్రామంలో వైద్యకళాశాల ప్రైవేటుకు వ్యతిరేకంగా పార్టీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవిబాబు మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యకు, వైద్యానికి పెద్దపీట వేసి పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకుందని చెప్పారు. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు వైద్య విద్య చదువుకునేందుకు 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపడితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేసి కార్పొరేట్‌కు దాసోహం చేసిందని మండిపడ్డారు. ఒంగోలులో ఉన్న రిమ్స్ హాస్పిటల్ మాదిరిగా ప్రతి జిల్లాలో 17 హాస్పిటళ్లు నిర్మించాలని వైస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటే దానిని కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం దారుమన్నారు. ఇలాగే కొనసాగితే ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు.

పోరాటాలు ఉధృతం చేస్తాం..

మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాలను కాపాడానికి కొత్తగా హాస్పిటళ్లకు శ్రీకారం చుడితే వాటిని పూర్తి చేయకుండా వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధించడం, అక్రమ కేసులు పెట్టడం, వారిని బెదిరించడం వంటివి చేయడమే కూటమి ప్రభుత్వం పని పెట్టుకుందని దుయ్యబట్టారు. ప్రభుత్వ కళాశాలలుగా చేయకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభాగ జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది 1500 మంది డాక్టర్లు కావడం లక్ష్యంగా పెట్టుకోవడం, ఎంతో మంది ఉపాధి కల్పించడం వంటివి జగన్ మోహన్‌రెడ్డి కల్పిస్తే వాటిని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి నిర్వీరం చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. అనంతరం గ్రామస్తులతో ఫారాల మీద సంతకాలు సేకరించే కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోడూరి గోపి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు తుళ్లూరి వెంకటనారాయణ, సింగోతు మల్లికార్జున, శ్రీనివాస రెడ్డి, కోడూరి వెంకటరెడ్డి, చినిగే బ్రహ్మారెడ్డి, కోడూరి తిరుపతిరెడ్డి, పురిణి శివకృష్ణ, జజ్జర సాంబయ్య, చంద్రశేఖర్, వెంకటరంగం, చినిగే ఏడుకొండలు, పురిణి ఏడుకొండలు, తంబి కాంతారావు, ద్వారం నాగరాజు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, జిల్లా మహిళా కమిటీ సెక్రటరీ టి.మాధవి, ఒంగోలు నగరం అంగన్‌వాడీ అధ్యక్షురాలు బడుగు శోభలత, కమిటీ సభ్యురాలు మాధవిలత పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాసుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం మహా సుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆగమపండితుడు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు, హోమం చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాత, శ్రీగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు జయంతిని పురస్కరించుకొని స్థానిక నీరజ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో ఆలూరు చిత్రపటానికి రమణారావు సతీమణి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కుమారులు డాక్టర్ శ్రీనివాసచరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

తాగునీటి సమస్యను పరిశీలించిన ఎంపీడీవో



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు: తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని నందిపాడు గ్రామంలో తాగునీటి సమస్యను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలు ఎంపీడీవోతో మాట్లాడుతూ తమకు గుండ్లకమ్మ నది నుంచి నీరు తీసుకోవడానికి సౌకర్యం ఉందన్నారు. గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నీటిని నదిలోకి విడుదల చేస్తున్న క్రమంలో ఎర్రనీరు వచ్చిచేరుతుందని సమస్యను వివరించారు. గ్రామానికి ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉన్న బావి నుంచి నీరు గ్రామానికి తరలించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు. ఈ క్రమంలో ఆమె బావిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆమెతో పాటు గ్రామ కార్యదర్శి సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.

స్కాన్ చేసిన తర్వాతే మద్యం విక్రయించాలి



మద్యం సీసాలను స్కాన్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు



మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ అధికారి అయేషాబేగం

చీమకుర్తి: మద్యం సీసాలను స్కాన్ చేసిన తర్వాతనే వినియోగదారులకు మద్యం సీసాలను విక్రయించాలని ఎక్సైజ్ సీఐ, ఎస్సై ఆధ్వర్యంలో మద్యం దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. గురువారం చీమకుర్తి సర్కిల్ పరిధిలోని 18 మద్యం దుకాణాలను ఈ సందర్భంగా మద్యం సీసాలను స్కాన్ చేయటం ఎలా ? అనేది ప్రదర్శించి దుకాణాల యజమానులకు వివరించారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయటం ద్వారా మద్యం సీసాకు సంబంధిచిన కంపెనీ వివరాలు వస్తాయని తెలిపారు. అలా రానట్లయితే అలాంటి మద్యం సీసాలను కల్తీ మద్యంగా నిర్ధారిస్తారన్నారు. మద్యం కొనుగోలు చేసే వారు కూడా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్వంతంగా మద్యం సీసాలు, మూతలపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి మద్యం నాణ్యతను పరీక్షించవచ్చని తెలిపారు.

మద్యం సీసాపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకోవచ్చు

ఒంగోలు సిటీ: ప్రతి వినియోగదారుడు మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను (బీర్ బాటిల్స్ కాకుండా) స్కాన్ చేసి ఉత్పత్తి నిజమైనదేనా అని తెలుసుకోవచ్చని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఓ.అయేషాబేగం అన్నారు. గురువారం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలలో అవగాహన పెంపొందించి, నకిలీ మద్యం, చట్ట విరుద్ధమైన బెల్ట్ షాపుల నివారణ కోసం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలు గమనిస్తే యాప్ ద్వారానే ఫిర్యాదు చేయవచ్చన్నారు.

లక్ష్మి భౌతికకాయానికి యూటీఎఫ్ నివాళులు



లక్ష్మి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఒంగోలు సిటీ: యూటీఎఫ్ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి డీ వీరాంజనేయులు భార్య లక్ష్మి అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. మృతురాలు లక్ష్మి ఒంగోలు నవోదయ పాఠశాలలో బోధనేతర సిబ్బందిగా పనిచేస్తున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మి భౌతికకాయాన్ని యూటీఎఫ్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. వారి వెంట రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షుడు జి.ఉమామహేశ్వరి, రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై, కోశాధికారి ఎస్.చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు ప్రభాకరరెడ్డి, ఎం.సంధ్యారాణి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

దోమలతో సావాసం.. రోగాలకు ఆవాసం!

- గ్రామాల్లో అటకెక్కిన పారిశుధ్యం
- పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలు



సైడు కాలువలలో పిచ్చి మొక్కలు పెరుగుతున్న దుస్థితి



ఇలపావులూరులో డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు



దోమలకు ఆవాసాలుగా మారిన డ్రైనేజీ

చీమకుర్తి రూరల్:

మండంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం పరిహాసంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయడం మానేశారు. వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లోని వీధుల్లో కాల్వలు మురుగుతో నిండిపోయాయి. ఫలితంగా దోమలు చేరడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అంతర్గత రోడ్ల మీద తిరగాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

ఇలపావులూరులో సచివాలయ పరిధిలోని ఎస్సీ కాలనీ, గ్రామంలోని ప్రధాన వీధులవెంట పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కాల్వల్లో మురుగుపేరుకుపోవడంతో దోమలు ఆవాసాలుగా మారాయి. సైడుకాలువలు ఉన్నా వాటిని నిర్వహించలేని దుస్థితి నెలకొంది. చుట్టు పక్కల, అన్నీ వీధుల కాలువల్లో చాలా నెలలుగా పూడిక తీయకపోవడంతో దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యపై దృష్టి సారించి దోమల బెడద నుంచి కాపాడాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 19 మందిపై కేసు నమోదు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ 19 మందిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఈఈ హైమావతి తెలిపారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం విజిలెన్స్ దాడుల వివరాలను వెల్లడించారు. మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు 24 బృందాలుగా ఏర్పడి 19 మంది విద్యుత్ అక్రమ వినియోగ దారులను గుర్తించి వారికి రూ.1.33 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. విజిలెన్స్ ఈఈలు కె.వెంకటేశ్వర్లు, పీజీ నారాయణ, కె.వెంకటేశ్వర్లు, కె.కోటేశ్వరరావు, ఉమాకాంత్, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ ఎల్.రమేష్ పాల్గొన్నారు.

11.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

సింగరాయకొండ: మండలంలో గురువారం 11.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోనదైనట్లు ఏఎస్‌ఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ వర్షం వరిసాగుకు ఎంతో అనుకూలమని, రైతులు పొలాలు దుక్కులు దున్నుకోవటానికి ఉపయోగంగా ఉందని వ్యవసాయాధికారులు వివరించారు. వర్షం కారణంగా రోడ్లు బురదమయంగా మారాయి. జరుగుమల్లి మండలంలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ సుబ్రహ్మణ్యం వివరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న శిద్దా కుటుంబ సభ్యులు

ఒంగోలు సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానం అని ఆర్యవైశ్య నాయకులు పేర్కొన్నారు. గురువారం పారిశ్రామిక వేత్త, చాంబర్ ఆఫ్ కామర్స్–ఇండస్ట్రీ సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి శిద్దా రాఘవరావు తనయుడు శిద్దా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు ఒంగోలులో నిర్వహించారు. శుభాకాంక్షలు తెలపడానికి అభిమానులు, నాయకులు యువత, వ్యాపార వర్గాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చీమకుర్తిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు క్రీడాదుస్తులు, బండ్లమూడి హైస్కూలు విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్, బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు అల్పాహారం, పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లక్ష్మీ గ్రానైట్ మేనేజర్ ఉప్పుటూరి కృష్ణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు సుబ్బారావు, పల్లపోతు వెంకటేశ్వర్లు, జలదంకి కృష్ణారావు పాల్గొన్నారు.

తక్షణం ప్రాణాలను కాపాడే సంజీవని సీపీఆర్



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఒంగోలు సిటీ: గుండె జబ్బుల బారి నుంచి సీపీఆర్ సంజీవనిలా ఉపయోగపడుతుందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. గురువారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్‌లో అవగాహన, లైవ్ డెమో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆపత్కాల పరిస్థితిలో ఉన్నప్పుడు వ్యక్తి ప్రాణాలను సీపీఆర్ ద్వారా కాపాడవచ్చన్నారు. ఇంట్లో, బయట అందరూ సీపీఆర్‌ను తప్పక నేర్చుకోవాలని కోరారు. అనంతరం మార్కెట్‌లో వ్యాపారులకు, వినియోగదారులకు సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపించారు. చిన్నపిల్లలు, మహిళల చేతచేయించి అవగాహన కల్పించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టరు ప్రభాకర్, వైద్యులు అనస్తీషియా ఇన్‌చార్జి చలపతి, కమ్యూనిటీ మెడిసిన్ శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ త్రినాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రణీత్, యశోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తకు నాయకుల నివాళులు



నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు, అంజిరెడ్డి, రవీంద్రరెడ్డి

కొత్తపట్నం: మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ నాయకులు గురువారం నివాళులర్పించారు. మండలంలోని మోటుమూల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, ఎంపీటీసీ సభ్యుడు పురిణి వెంకట్రావు తను తండ్రి పురిణి తిరపతిరెడ్డి ఇటీవల మృతి చెందారు. అదేవిధంగా కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త కొక్కిలగడ్డ నాంచార్లు తల్లి కొక్కిలగడ్డ జలంధర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వీరి పెద్ద కర్మ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు తుళ్లూరి వెంకటనారాయణ, మల్లికార్జున, తంబి కాంతారావు, కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, సైకం రాంబాబు కొంత మంది నాయకులు నివాళులర్పించారు. అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు.